చెరువుల పరిరక్షణ మన బాధ్యత

మియాపూర్: చెరువుల పరిరక్షణ మనందరి బాధ్యత అని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పల పాటి శ్రీకాంత్ అన్నారు. డివిజన్ పరిధిలోని పటేల్ చెరువును మల్లిగావాడ్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మియాపూర్‌లోని అన్ని చెరువులు, కుంటల్లో పూడిక తీసి మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరువుల చుట్టు మొక్కలు పెంచి ఆహ్లాదకర వాతావరణం అందిస్తామన్నారు. ప్రస్తుతం మల్లిగావాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మియాపూర్ గురునాథం చెరువును అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఆయన వెంట సభ్యులు రామ్, చైతన్య ఉన్నారు.

పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో



శేరిలింగంపల్లి: సైన్స్‌డేను పురస్కరించుకొని శేరిలింగంపల్లి శ్రీ చైతన్య స్కూల్‌లో సైన్స్ ఎక్స్‌పో 2025ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ ప్రదర్శనల వలన విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రాజెక్టుల తయారీ పోటీ తత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం శివరామకృష్ణ, ప్రాంతీయ ఇంచార్జీ పద్మజ, అకడమిక్ డీన్ రాజేష్ కుమార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో కేఏ అబ్బాస్ మెమోరియల్ లెక్చర్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో శుక్రవారం యూనివర్సిటీ ఫిల్మ్ క్లబ్ ఆధ్వర్యంలో కేఏ అబ్బాస్ మెమోరియల్ లెక్చర్‌ను నిర్వహించారు.'ఇస్లామికేట్ కల్చర్ ఆఫ్ బాంబే సినిమా' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ న్యూఢిల్లీ విశ్రాంత ఫ్యాకల్టీ ప్రొఫెసర్ ఐరా భాస్కర్ మాట్లాడుతూ సినిమా పాత్ర మన సంస్కృతీ సాంప్రదాయాలలో పాతుకుపోతోందన్నారు. ఇస్లామికేట్ సంస్కృతి యొక్క కవితాభావాలు, సంగీత సాంప్రదాయాలు, నిర్మాణ మూలాంశాలు భారతీయ సినిమా యొక్క దృశ్య, కథన భాషకు అపరిమితంగా తోడ్పడ్డాయన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదుగురు నకిలీ వైద్యులపై కేసు నమోదు

మియాపూర్: నకిలీ వైద్యులపై మియాపూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు మియాపూర్ లోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. నకిలీ వైద్యం చేస్తున్న ఐదుగురు ఆర్‌ఎంపీలపై మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేయించారు.మార్తాండనగర్‌లో శ్రీ వెంకటేశ్వర క్లినిక్ నిర్వహిస్తున్న పి అరవింద్, ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ నడుపుతున్న కవిత, ప్రేమ్ నగర్ కాలనీలో శ్రీ సాయి ఫస్ట్ ఎయిడ్ నడుపుతున్న ఎ. రమేష్, హఫీజ్‌పేట్‌లో రెహమనీయ క్లినిక్ నడుపుతున్న ఎండీ. అబ్దుల్ వాహిద్, మియాపూర్ హెచ్‌ఎంటీ కాలనీలో హెల్త్ కేర్ సెంటర్ నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్‌లపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా, ఎంబీబీఎస్ చదవకుండా వైద్యం చేస్తే కేసులు నమోదు చేస్తామని మెడికల్ కౌన్సిల్ అధికారులు హెచ్చరించారు.

యువకుడు ఆత్మహత్య

చందానగర్: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శేరిలింగంపల్లి నెహ్రూనగర్‌కు చెందిన రాజేశ్వరి కేర్‌టేకర్‌గా పని చేస్తోంది. ఇటీవల ఆమె భర్త సురేష్‌కుమార్ మృతి చెందాడు. ఆమెకు కుమారుడు దీక్షిత్‌రాజ్ (17), ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు వశిష్ట కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆమె యథావిధిగా డ్యూటీకి వెళ్ళగా కుమారుడు దీక్షిత్‌రాజ్ కాలేజీకి వెళ్ళి హాల్‌టికెట్ తీసుకువస్తానని చెప్పాడు. సాయంత్రం 5 గంటలకు ఆమె ఇంటికి వచ్చే సరికి తలుపు మూసి ఉండడంతో వెనుక నుంచి బెడ్‌రూమ్ తలుపు తీసి చూడగా కుమారుడు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. ఆమె కేకలకు చుట్టు పక్కల వారు వచ్చి యువకుడిని కిందకు దించారు. చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చదువు ఒత్తిడితో దీక్షిత్‌రాజ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లి పోలీసులకు చెప్పారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీలో మార్చి 9న కట్ట మైసమ్మ జాతర, 10, 11న నిర్వహించనున్న ఎల్లమ్మ జాతరకు రావాలంటూ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి శుక్రవారం గడ్డపోతారం గ్రామస్తులు ఆహ్వాన పత్రిక అందజేశారు.

హెచ్‌సీయూ బంద్.. తరగతుల బహిష్కరణ



హెచ్‌సీయూ పరిపాలనా భవనం ముందు ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

యూనివర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట విద్యార్థుల ఆందోళన



హెచ్‌సీయూ ప్రధాన ద్వారం ముందు విద్యార్థి సంఘాల నిరసన

రాయదుర్గం: హెచ్‌సీయూలో పోర్టికో కూలిపోయిన ఘటనపై యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఇచ్చిన పిలుపు మేరకు విద్యార్థులు శుక్రవారం తరగతులను బహిష్కరించారు. దీనికి పలు విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి.విద్యార్థులంతా ఊరేగింపుగా హెచ్‌సీయూ ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. పోర్టికో కుప్పకూలిన ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి, గాయపడిన కార్మికులకు ఉచిత వైద్యం అందించాలి, ఆ కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకునే వరకు పోరాటం చేస్తామని నినాదాలు చేశారు. విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఉమేష్ అంబేద్కర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై కేసు నమోదు చేయాలని, కార్మికులతో 18 గంటల వరకు పనిచేయించడంపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిష్పక్షపాత విచారణ జరిపేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

పరిపాలనా భవనం ఎదుట ఏబీవీపీ ధర్నా

హెచ్‌సీయూలో నూతన భవన పోర్టికో కూలిపోయిన ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏబీవీపీ హెచ్‌సీయూ శాఖ డిమాండ్ చేసింది. శుక్రవారం ఉదయం హెచ్‌సీయూ పరిపాలనా భవనం ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు డి.అనిల్‌కుమార్, కార్యదర్శి ఆయుష్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించారా లేదా అనే విషయం తెలియాలంటే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ హెచ్‌సీయూ నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికులందరూ సేఫ్

భవన భద్రత, ఘటనపై విచారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

- 11 మంది కార్మికులకు గాయాలు.. ఇద్దరికి హెల్త్ సెంటర్‌లో చికిత్స
- ఆస్పత్రి నుంచి 8 మంది డిశ్చార్జి.. డాక్టర్ల పర్యవేక్షణలో ఒకరు
- హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ స్పష్టీకరణ

రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లో జరిగిన ఘటన, భవన భద్రతపై నివేదిక అందించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఘటనపై వివరణాత్మక నివేదిక, క్యాంపస్‌లోని అన్ని పని ప్రదేశాలలో వారు చేపట్టాల్సిన దిద్దుబాటు, నివారణ చర్యలను వెంటనే సమర్పించాలని సీపీడబ్ల్యూడీని ఇప్పటికే కోరామన్నారు. హెచ్‌సీయూ ఘటనలో గాయపడిన కార్మికులందరూ సేఫ్‌గా ఉన్నారని మొత్తం 11 మంది కార్మికులలో ఇద్దరికి హెచ్‌సీయూ క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌లో చికిత్స అందించి పంపించి వేశామన్నారు. మిగిలిన తొమ్మిది మంది కార్మికులను సమీపంలో ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించామని, శుక్రవారం 8 మందిని డిశ్చార్జి చేశారని తెలిపారు. ఒకరు చికిత్స పొందుతున్నారని ఆయన వివరించారు.ఈ ఘటన దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులను సీపీడబ్ల్యూడీకి అప్పగించామన్నారు. పోర్టికో పనిని పూర్తి చేస్తున్నప్పుడు స్లాబ్‌పై ద్రవ కాంక్రీట్ బదిలీ చేయడానికి ఉపయోగించే బూమ్‌పంప్ స్కాఫోల్డింగ్ మధ్య కనెక్షన్ ఏర్పడి సపోర్ట్ స్ట్రక్చర్ కూలిపోయి ప్రమాదానికి దారితీసిందని ఆయన వివరించారు.

విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు నిరంతరం సాగాలి



హెచ్‌సీయూలో అంతర్జాతీయ సదస్సు ముగింపు వేడుకల్లో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: భాషా సాహిత్య రంగాలలో విషయం ఒక ప్రత్యేకమైన అధ్యయనం కావాలని ప్రముఖ సాహిత్య, చరిత్రకారుడు, పరిశోధకుడు డాక్టర సుంకిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ముగింపు సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధనలే మానవ విజ్ఞానానికి దోహదపడే అతి ప్రధానమైన అంశాలని, విశ్వవిద్యాలయాల్లో పరిశోధన నిరంతరం కొనసాగాలని పేర్కొన్నారు. అమెరికా నుంచి ప్రకాశిక త్రైమాసిక పత్రిక ప్రధాన సంపాదకుడు సీనియర్ ప్రొఫెసర్ కొవ్వలి గోపాలకృష్ణ మాట్లాడుతూ అమెరికాలో అండర్ గ్రాడ్యుయేట్ స్థాయి నుంచే పరిశోధనా విధానం పట్ల ఒక అవగాహన కలిగిస్తారన్నారు.అటువంటి కోర్సులు భారత్‌లోని విశ్వవిద్యాలయాలు కూడా అవలంబించాలని సూచించారు. కళాశాల, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు క్రిటికల్ థింకింగ్, రీడింగ్ అనే అంశాలు పెడితే సరైన ఫలితానిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆచార్య పిల్లల మర్రి రాములు, తెలుగు శాఖ మాజీ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్యులు గోనానాయక్, పవన్‌కుమార్, వారిజారాణి, త్రివేణి, డాక్టర్ భూక్యాతిరుపతి,బి భుజంగరెడ్డి, విజయకుమార్, బాశెట్టి లత రెడ్డి శ్యామల తదితరులు ప్రసంగించారు.

ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన

మాదాపూర్: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మాదాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. మాదాపూర్‌లోని లెమన్‌ట్రీ హోటల్ వద్ద శుక్రవారం సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్‌ను తప్పని సరిగా ధరించాలన్నారు. రాంగ్‌రూట్‌లలో రావడం వల్ల ఇతరులకు అసౌకర్యం కలగడంతో పాటు ప్రమాదాలు జరుగుతాయన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మేనేజర్ కేశవ్, ట్రాఫిక్ వాలంటీర్లు, ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఐటీ ఉద్యోగులు, వాలంటీర్లు

ఎన్నికల హామీలు అమలు చేయాలి

ఎంసీపీఐ (యూ) ఆధ్వర్యంలో ధర్నా



శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంసీపీఐ నాయకుల ధర్నా

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎంసీపీఐ (యూ) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు ఇస్లావత్ దశరథ్ నాయక్, పల్లె మురళిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎత్తి చూపుతున్నారే గాని హామీల అమలుపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు. బడ్జెట్‌లో విద్య, వైద్య, మహిళ, యువజన సంక్షేమ రంగాలకు 40 శాతం కేటాయించాలని, అసైన్డ్ భూములలో నివాసం ఉన్న వారికి చట్టబద్ధత కల్పించాలన్నారు. అదే విధంగా ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కళావతి, అనిత, విమల, శివాని, ఎండీ సుల్తానా బేగం, ఇందిర, లక్ష్మీ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

పటాన్‌చెరు టౌన్: ఎప్పటికప్పుడు కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ జీవన విధానాల్లో విజ్ఞాన శాస్త్రం పాత్ర గురించి తెలియజేయడానికి ఈ సైన్స్‌డేని నిర్వహించుకుంటామని తెలిపారు.

కళాశాల విద్యార్థుల మధ్య గొడవలు.. కేసు నమోదు

మాదాపూర్: మాదాపూర్‌లోని రెసోనెన్స్ శాతవాహన కళాశాలలో గురువారం విద్యార్థుల మధ్య వాగ్వివాదం జరిగింది. ప్రతి రోజు ఒక వర్గం విద్యార్థులు.. మిగిలిన వారిని టార్గెట్ చేసుకుని కొడుతున్నారని, విద్యార్థులు దాచుకున్న నగదు, పుస్తకాలను ఎత్తుకెళ్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఓ విద్యార్థిని దారుణంగా కొట్టడంతో తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే వారు కళాశాలకు వచ్చి యాజమాన్యాన్ని నిలదీశారు. దీనిపై కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తల్లిదండ్రులు ఆరోపించారు. కాగా రాత్రి సమయంలో అమాయకులైన విద్యార్థులను కొట్టి హింసిస్తున్న వారిపై కొందరు మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా...కేసు నమోదు చేశారు. అలాగే దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు.

సైన్స్‌లో విస్తృత పరిశోధనలు జరగాలి

హెచ్‌సీయూ భౌతికశాస్త్రం ప్రొ.వెంకటయ్య



సివి రామన్ చిత్రపటానికి నివాళులర్పించిన అతిథులు

రాయదుర్గం: భారతదేశ అభివృద్ధికి నూతన ఆవిష్కరణలు ఎంతో అవసరం అని, సైన్స్ అనేది ప్రగతికి ఆనవాలు కావున మరిన్ని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని హెచ్‌సీయూ భౌతిక శాస్త్రం ప్రొఫెసర్ జి వెంకటయ్య అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలో జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం (సైన్స్‌డే)ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ యువతకు సాధికారత కల్పించడం అవసరమని అన్నారు. అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామి యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఎన్‌వి ప్రిన్సిపల్ డి విజయభాస్కర్, వైస్ ప్రిన్సిపల్ ఎంఎస్ మిత్రి, టీచర్లు శ్రీనివాసరావు, రామచంద్రు, ఎం చౌదరి, ఆదినారాయణరెడ్డి. ప్రసన్నకుమార్, ఈపీటీఆర్‌ఐ సభ్యులు, జేఎన్‌వి విద్యార్థులు, అసోసియేషన్ సభ్యులు అమ్మయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వైభవ్‌లో విద్యార్థుల కోలాహలం



విజ్ఞాన్ వైభవ్-2025కు తరలి వచ్చిన విద్యార్థులు

గచ్చిబౌలి: విజ్ఞాన్ వైభవ్-2025లో విద్యార్థుల సందడి నెలకొంది. గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో విజ్ఞాన్ వైభవ్ ప్రారంభోత్సవానికి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి 20 వేలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. రక్షణరంగం ఆయుధాలు, విడి భాగాలు, క్షిపణులు, డ్రోన్‌లను ఆసక్తిగా తిలకించారు. కాగా రిజిస్టేషన్ చేసుకున్న విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

విజ్ఞాన్ వైభవ్ కారణంగా ట్రాఫిక్ జాం కాకుండా గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. స్టేడియం ప్రధాన ద్వారం పక్కనే బైక్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. కార్లను పార్కింగ్ ఏరియాకు తరలించారు. బస్సుల పార్కింగ్‌కు ఏర్పాటు చేశారు. స్టేడియం నుంచి ట్రిపుల్ ఐటీ జంక్షన్ వరకు వాహనాలు బారులుదీరాయి. పోలీసులు ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించారు.

ఆకట్టుకున్న బి2బీ ఎక్స్‌పో-2025

ఎస్కీ'లో విమెన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్

చందానగర్/రాయదుర్గం: మహిళల ఎక్స్‌పో-2025 అందరినీ ఆకట్టుకుంది. మహిళా వ్యాపారులకు కొత్త అవకాశాలు అందించడమే లక్ష్యంగా కాన్ఫడరేషన్ ఆఫ్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (సీఓడబ్ల్యూఈ) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక విమెన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా కన్వెన్షన్ సెంటర్‌లో బి2బీ ఎక్స్‌పో-2025ను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు, ఇతరులు ఈ ఎక్స్‌పోను తిలకించారు. మహిళా వ్యాపారవేత్తలు తమ ఉత్పత్తులు, సేవలు ప్రదర్శించేందుకే ఈ ఎక్స్‌పోను నిర్వహించారు. పలు సంస్థలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ప్రధాన సంస్థలు, 40పైగా కొనుగోలు సంస్థలు, 70 మంది విక్రేతలు పాల్గొన్నారు. ఈ ఎక్స్‌పోలో మహిళా వ్యాపారవేత్తలు పర్యావరణహిత బ్యాగులు, సాంకేతిక వస్తువులు తదితరాలను ప్రదర్శించారు. తెలంగాణ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, హర్యానా వంటి రాష్ట్రాలలో సీఓడబ్ల్యూఈ విస్తరించి ఉంది.





ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుపై 25 శాతం రాయితీ

- మార్చి 31 వరకు అవకాశం
- శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

గచ్చిబౌలి: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారులకు ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీని ప్రకటించారు. 2020 స్కీమ్‌లో భాగంగా ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ రాయితీ వర్తిస్తుంది. ఈ మేరకు శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి హెల్ప్ డెస్క్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ డెస్క్‌లో బల్దియా అదనపు సీసీపీ గంగాధర్, ఏసీపీ సాయిబాబా అందుబాటులో ఉంటారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ అనధికారిక ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు 2020లో రూ వెయ్యి రుసుము చెల్లించిన దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు పూర్తి ఫీజును మార్చి 31 లోగా చెల్లిస్తే 25 శాతం రాయితీ లభిస్తుందన్నారు. హెల్ప్‌డెస్క్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుందన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 9391869141లో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎస్ రంగారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు వసంతసిటీ, సైబర్ విలేజ్, సైబర్‌వ్యాలీ, ఇజ్జత్‌నగర్, ఎస్‌బీఐ కాలనీ, వివేకానంద నగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: వైట్‌ఫీల్డ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ..ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొత్తగూడ, మెజ్జిక్విటీ, గౌతమీ సొసైటీ, వైట్‌ఫీల్డ్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ కిషోర్ తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: లక్ష్మీవిహార్, నల్లగండ్ల హుడా కాలనీ ఫీడర్ల పరిధిలోమరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకట్‌నారాయణరెడ్డి తెలిపారు.

- ◆ 11 కేవీ లక్ష్మీవిహార్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లక్ష్మీవిహార్ ఫేజ్-1,2, డిఫెన్స్ కాలనీ, నల్లగండ్ల విలేజ్, డాక్టర్స్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.
- ◆ 11 కేవీ నల్లగండ్ల హుడా కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నల్లగండ్ల హుడా కాలనీ, రత్నదీప్ సూపర్ మార్కెట్ బ్యాక్‌సైడ్ ఏరియా, నల్లగండ్ల వాటర్‌ట్యాంక్ ఏరియా, వంద ఫీట్ల రోడ్డులో విద్యుత్ ఉండదు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

చందానగర్‌లో..

చందానగర్: హఫీజ్‌పేట్ సెక్షన్ పరిధి హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- ◆ సాయిరాంనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు కుమ్మరిబస్తీ, ఓల్డ్ హఫీజ్‌పేట్ కొంత భాగం, జనప్రియ నగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్ డి బ్లాక్, ఎన్‌కోఅపార్ట్‌మెంట్స్, డబుల బెడ్ రూమ్స్, అపర్ణ విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.
- ◆ హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 3.30 వరకు యూత్ కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, వార్డ్ ఆఫీస్, రైల్వే స్టేషన్, గ్రీన్ బవార్చి ఏరియాలలో..
- ◆ విశ్వంభర ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి 11.00 వరకు శిల్పా ఎవెన్యూ, విశ్వంభర ప్రాంతాలలో..

చందానగర్ సెక్షన్ పరిధిలో..

చందానగర్, పాపిరెడ్డి కాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలో.. ఆర్టీసీ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు మదీనాగూడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి వెనుక వైపు, కియా షోరూమ్ వెనుక ఏరియాలలో ..

- ◆ మార్కెట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సీఎం తోట, నార్నె ఎస్టేట్స్, ప్రేమ్‌నగర్ ఏ, బి బ్లాక్‌లు ప్రాంతాలలో..
- ◆ వైశాలీనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి 11.00 వరకు వైశాలీనగర్, ఏపీజీఓ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

వేమనకాలనీ సెక్షన్ పరిధిలో..

చందానగర్, మదీనాగూడ సబ్‌స్టేషన్ల పరిధిలో.. పీజేఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి 11.00 వరకు పీజేఆర్ ఏరియా రోడ్డు నెంబర్లు 1,3,5,7,10,12, లగ్జరీ అపార్ట్‌మెంట్ ఏరియాలలో ..

- ◆ శంకర్‌నగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 వరకు గౌతమీనగర్, వార్డు కార్యాలయం, బజాజ్ ఎలక్ట్రానిక్స్, శిల్పా ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో..
- ◆ శాంతినగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు శాంతినగర్, ఉషోదయా అపార్ట్‌మెంట్ రోడ్డు, ధర్మపురి టెంపుల్ రోడ్డు, దీప్తిశ్రీనగర్ రోడ్డు నంబర్ 14 నుంచి 25 వరకు, ఆదర్శనగర్ ప్రాంతాలలో ..
- ◆ సీబీఆర్ ఎస్టేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 వరకు సీబీఆర్ ఎస్టేట్స్, క్రోమా భవనం వెనకాల, శ్రీ దుర్గ హోమ్స్, ఆంధ్రాబ్యాంక్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.